# రాధారి బండ్లు

**నా** చిన్నతనంలో మా అన్నయ్య వివాహానికి మా ఊరునుంచి ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న ఓ గ్రామానికి తర్లి వెడుతున్నాం. ఏభై రెండెడ్ల బళ్ళు మా ప్రయాణానికి సిద్ధమయ్యాయి. రాత్రి పెందరాళే భోజనాలు చేసి బళ్ళెక్కాము.

బళ్ళ ఎద్దులు ఒంగోలు జతలు. కైలాస పర్వత శిఖరాలులా, నందీ భృంగులులా ప్రతీ బండికీ ఇటూ అటూ ఉన్నాయి. కొమ్ములకు నల్లతాళ్ళు నుదురున అలంకారపు పట్టీలు, మెడలలో గంటలు, చిన్న మువ్వలూ కలపట్టీలు. ఎత్తయిన బళ్ళు వెదురు చాపలు, గొంగళీలుకట్టి గూడులు, కూర్చునేందుకు మొదట వట్టిగడ్డీ, ఆపైన చాపా, పైన పరుపులో, తివాసీలో!

బళ్ళు సాగాయి. దాపటెద్దులకు పెద్ద గంటలు, వెలపల ఎద్దులకు చిన్న గంటలూ, మందర పంచమ స్వరాలు, శ్రుతి కలసి రాగాలాపనలు చేస్తున్నాయి. మువ్వలు తాళాలు చేస్తున్నాయి.

ఈవలా ఆవలా వరిచేలు. గట్లపైన కంది మొక్కల బారులు! – ఆ వెన్నెల నిండిన రాత్రివేళ ఈ బళ్ళబారు ప్రయాణం. చేలు ఇంకా మేలుకునే ఉన్నాయి. కీచురాయిలు ఏవో గీతాలు ఆలపిస్తున్నాయి. అప్పుడే కోతలు సాగుతున్నాయి. చిన్న వరులు కోతలై కుప్పలువేసి నూరుస్తున్నారు.

నూరుస్తూ ఆ కర్షకులు గొంతులెత్తి ఏదో తియ్యని పల్లెటూరు పదాలు మందర స్థాయిలో పాడుకుంటున్నారు, రోడ్డు పక్కవున్న మురుగు కాలవల్లో కలవ పువ్వులు చంద్ర కిరణాలు తమపై ప్రసరిస్తూ యుండగా భక్తితో 'ముకుళించుకొని' నిలచియున్నవి. మా రాధారిబళ్ళు సాగుతున్నాయి.

ఇంతట్లో బళ్ళకు బళ్ళకు పందాలు వచ్చాయి. అచ్చట రాచబాట కొంచెం వెడల్పుగా వున్నది. వెనకబడి వాడొకడు తన బండిని ముందరబళ్ళని తప్పించి ముందుబోయి తన బండిని మొనగాడి బండిని చేయాలని ఆశించాడు. తక్కిన బండ్లు ఊరుకుంటాయా? అన్ని బళ్ళను ఉరక లెత్తడం సాగించారు బండివాళ్ళు, "హై! హై! పప్పప్పా డిడిడి..." నీ గంటలు వూడిపోను ముందుకునడే" అనే కేకలతో బండివాళ్ళు ఎద్దులను అదిలించి, కొరడాలు ఫెళ్ళుమనిపిస్తూ, తోకలు మెలిపెడుతూ, బళ్ళను దౌడుచేయిస్తున్నారు. అంతవరకు బండి కుదుపుకు ఉయ్యాల వూపు. బండిగంటల మ్రోత లాలిపాటలు కాగా మొగవారు, ఆడవారు, చిన్నబిడ్డలు హాయిగా నిద్దుర కూరిమై మరచి వున్నారు. ఈ

గడబిడకు ఎవరిబళ్ళలోవారు చటుక్కున లేచారు. బళ్ళవాళ్ళకే కాకుండా బండిలో వాళ్ళకుకూడ ఉషారెత్తింది. "మన బండి ముందరపోనివ్వోయి", "మన బండి ముందర పోనివ్వోయి. అని పంతాలు సాగించారు. ఈలాసాగింది మా ప్రయాణం. తెల్లవారేసరికి ఓ వూరు దగ్గిరకు చేరుకున్నాం.

ఆ ఊరు చెరువుగట్టుని మా బళ్ళన్నీ విప్పారు. రాత్రే వంటచేసి ఒక బండిలో ప్రత్యేకంగా ఓ గుండిగ అన్నం, ఆవకాయ, దప్పలం, పులుసు, కందిపొడి, పెరుగు, పేరినెయ్యి మొదలైన వస్తువులు పెళ్ళి పెద్దలు తీసుకొచ్చి వుండడంచేత, చంటిపిల్లలకు బళ్ళవాళ్ళకు చల్ది భోజనాలు పెట్టారు. పెద్దలు చెరువులో స్నానాలు చేసి సంధ్యా వందనాలు వార్చుకుంటున్నారు. జపాలు కానిస్తున్నారు. ఇంతట్లో "చో చో చ్చో" అంటూ బాకాలు వైతాళికులు కాగా హో ఓం భోం" - అంటూ బోయలూ పాటపాడుతూ ఉండగా పెళ్ళికొడుకు పల్లకీ చక్కా వచ్చింది. తెల్లవారగట్ట బయలుదేరి పల్లకీ ఈ మజిలీ దగ్గర మమ్మల్ని కలుసుకుంది.

మకాం చేసింది చెరువుగట్టో కాలవగట్టో అయితే ఆ దృశ్యం ఎంత అందంగా ఉండేది. గట్టంతా బళ్ళతో విప్పి వేసిన ఎద్దులతో అటూ ఇటూ తిరిగే మనుష్యులతో చెట్లతో తోపులతో నిండి వుంటుంది. అన్నన్ని కమలాలు కలవలూ వికసించివున్న ఆ చెరువు నీటిలో ఆ ఏటి ప్రవాహంలో, ఆ కాలువజాలులో ప్రతిఫలిస్తూ ఉంటాయి.

అలాంటి సమయంలో ఆ చలిది అణ్ణం తినడమూ సరదాగానే ఉండేది. కంది పొడుం, ఆవకాయ, గోంగూర పచ్చడి ఘుమఘుమలాడే నెయ్యి, పెరుగూ తినడానికి పెద్ద వాళ్ళే కక్కుర్తి పడేవారు.

ఈ పెళ్ళిళ్ళకు ఎంత గొప్పవాళ్ళయితే అన్ని ఎక్కువ బళ్ళు కడతారు. మాతాలు కాలో ఒక గొప్ప భూస్వామి ఇంట్లో పెళ్ళికి వెయ్యెకరాల మాగాణీ కలిగిన మగపెళ్ళివారు అయిదువందల రెండెడ్ల బండ్లు కట్టుకు వచ్చారు.

ఆడ పెళ్ళివారు పెళ్ళి జరిగేటంతకాలమూ ఎద్దులకు మంచిమేత, గడ్డిగాదమూ అన్నీ చక్కగా సరఫరా చేయాలి. బళ్ళవాళ్ళకు భోజనాలతోపాటు మంచి పొగాకు అందియ్యాలి ఆడపెళ్ళివారు.

వేసవికాలంలో రాత్రిళ్ళు, ఉదయాస్త మానాల చల్లబడిన కాలంలోనూ రాధారిబళ్ళ ప్రయాణాలు సాగేవి శీతాకాలం పగలంతా ప్రయాణం సాగుతూ ఉండేది. మెరక ఊళ్ళలో నూతులదగ్గర మకాములు మజిలీలో. దారి వెంబడి సత్రములు ఉండేవి. పూర్వకాలంలో వైద్యశాలలూ, పశువైద్యశాలలూ ఉండేవి.

చుట్టాలను చూడాలన్నా, ఆడబడుచులను పుట్టింటికి తీసుకురావాలన్నా, అత్తింటికి కోడలును పంపాలన్నా ఇలా యీ రెండెడ్ల బళ్ళ ప్రయాణమే పూర్వం. చిన్న బిడ్డల తల్లి అయితే మేనాసవారీ ఎక్కి ఆవిడ బళ్ళతో ప్రయాణం చేసేది.

పూర్వం చెన్నపట్నం. కంపెనీ దొరలతో పని ఉన్నప్పుడు రైళ్ళురాని క్రితం రాయలసీమ నుంచీ, కోస్తా జిల్లాల నుంచీ ఈ రాధారి బళ్ళ ప్రయాణాలే, కోస్తా జిల్లాలవారు కొందరు ఓడలెక్కి చెన్నపట్నం వచ్చేవారట.

భద్రాచలం శ్రీసీతారామచంద్ర కళ్యాణ మహోత్సవానికి పడవలమీద వెళ్ళేవారు. వెదుతూ వుండగా దేశ దేశాల నుండీ రాధారి బళ్ళమీదనే యాత్రలు సాగించుకు వచ్చేవారు. కోస్తా జిల్లాలవారు మొన్న మొన్నటివరకూ ఎఱ్ఱుబాలెం దగ్గరరెండెడ్ల రాధారి బళ్ళమీదకే ప్రయాణాలు, శివరాత్రి మహోత్సవానికి శ్రీశైలం వెళ్ళాలన్నా చాలదూరం అలాగే ప్రయాణాలు సాగిస్తారు ఈ నాటికీ! పేట్రాయి, కదిరీ, పెంచెలకోన, అహోబిలం, యాదగిరి నరసింహదేవేర్ల తిరునాళ్ళకు ఈనాటికీ ఈలాటి ప్రయాణాలే.

కొటప్పకొండ శివరాత్రి తిరునాళ్ళకు కొండవీడు, పల్నాడు, వినుకొండ, అద్దంకి, ఒంగోలు సీమలనుండి పల్లె పల్లెలో తిరునాళ్ళు ఇంకా కొన్ని నెలలు వుందనగానే ఎద్దులను తయారు చేస్తారు. మంచి మేత, రోజూ సరియైన పరిశ్రమలతో అవతరించి బసవేశ్వరులులా సిద్ధం అవుతాయి ఎద్లు. ప్రభలు రాతిచక్రాల బళ్ళమీదకూడ కడతారు తిరునాళ్ళు ముందుగ్గా సరిగ్గా ఉత్సవానికి కోటప్పకొండ ఎల్లమంద గ్రామం, చేరుకునేందుకు వీలుగా గ్రామం, గ్రామం అంతా బయలుదేరుతుంది. ముందు మొనగాడి గిత్తలు మేరు పర్వత శిఖరాలులా వెలిగిపోతుండగా, గంగిడోళ్ళు ఆడించుకుంటూ, తలలు తిప్పుకుంటూ అలంకారాలు, గంటలూ, మువ్వలూ మహాగానం చేస్తూ వుండగా మూపురాలు పాలసముద్ర మహావీచికలులా ఉప్పొంగుతూ వుండగా జరీపువ్వులు పచ్చడాలు వీపులను అలంకరించి వుండగా బయలుదేరుతాయి. నాలుగూ ఎనిమిదీ జతలుకూడా కడతారు. ఆ ప్రభలకు, ఆ వెనక ఊరి రాధారిబళ్ళన్నీ బయలుదేరుతాయి. మకాములు చేసుకుంటూ కోటప్పకొండ చేరుతాయి. ఆ కొండమీద నుంచి ఈ రాధారిబళ్ళ విడిదెలు చూస్తే ఒక మహాచిత్రంలా ఆ ప్రభలూ ఆ బళ్లూ ఆ జనసముద్రం ప్రత్యక్షమవుతారు.

ఏ వివాహానికి వెళ్ళినా, ఏ తిరునాళ్ళకు తరలినా, ఏ వర్తకానికి బేహారమైనా ఈ రాధారిబళ్ళవిడిదె ప్రదేశాలు ఏవో ఆనందానుభూతులతో నిండివుంటాయి. చెరువులు కాల్వలు, నదులు, బావులు, సత్రాలు తోపులు మజిలీలై విడిదిలై చైతన్య వంతాలవుతాయి.

మెరక ఊళ్లల్లో చెరువులు, కొండ వాగులు, బావులు, గోదావరి జిల్లాల్లో నల్ల చెరువు, తెలంగాణంలో పాకాల చెరువు, పాలంపేట చెరువు, రాయలసీమలో రాయ సముద్రమూ బుక్కపట్నం చెరువూ, అలాంటి మహత్తరమైన చెరువుగట్టుల మకాములు పల్లపు ఊళ్ళలో చెరువులూ, కాల్వగట్టులూ! చెరువులు ఎండిన వాగులు రాకపోయినా పక్కనే స్వచ్ఛమైన పాతాళ గంగలు ప్రవహించే బావులుంటాయి.

ఏ కృష్ణఒడ్డునో, గోదావరీ తీరాన్నో ప్రయాణాలైతే ఎక్కడ విడిది చేయకూడదు? ఈ రాధారిబళ్ళ ప్రయాణం, ఆ విడిదిలు నాటక కావ్యాలే అవుతాయి, ఎంత కొత్తవారు కలుసుకున్నా యాత్రా స్నేహాలుద్భవిస్తాయి. కాశీమజిలీల కథలు, కథాసరిత్సాగరం కథలూ చెప్పుకుంటారు. యువకుల జీవితాలలో ప్రణయ సంఘటనలు వెన్నెలు ప్రసరించి పోతూ వుంటాయి.

మోటార్లు, రైళ్ళు, బస్సులు, లారీలు, టాక్సీలు, కార్లు వచ్చిన ఈ నవ్యయుగంలో కూడా పల్లెటూర్లలో తెల్లటి మేఘాలులా, వెండి కొండలులా యెద్దులు కట్టినా రెండెడ్ల బళ్ళే గ్రామాలులా, వెండి కొండలులా యెద్దులు కట్టినా రెండెడ్ల బండ్లు, ఊరు ఊరికి

ప్రయాణం రెండెడ్ల బండ్లు, ఎంత చిన్న వ్యవసాయ దారుడైనా ఒక బండైనా వుండి తీరాలి. గూడుకట్టకుండా పొలంపని చేసేబండి, గూడు కట్టగానే ప్రయాణం బండి అవుతుంది.

పల్లెటూరుకు వచ్చేసామానులు, పల్లెటూరు నుండి వెళ్ళే సామానులు చేరవేసే ఆ రాధారిబళ్ళు, ఆ గ్రామాలకు ప్రాణాధారాలే అవుతవి. ఆ గ్రామ శిల్పి అయిన వడ్రంగి చేవ తిరిగిన మంచిరకం కఱ్ఱతో నిర్మించిన బండి అలా దశాబ్దాలు పనిచేస్తూనే వుంటుంది. శాంతమూ, శక్తీ మానవ సన్నిహితత్వమూ మూర్తించిన ఎడ్ల వెంకటేశ్వరుని అవతారాలన్నా, బసవేశ్వరుని స్వరూపాలన్నా ఆ భావాలు మహాభావాలు కావా మరి!

చేననక, గట్టనక, ఏరనక, దారనక, నిదానంగ, నిశ్చలంగ గంటలు మువ్వలు మ్రోగించుకుంటూ ఈ రాధారి బళ్ళు తిరుగుతూనే వుంటాయి.

భారతదేశమంతా ఈ రెండెడ్ల బండ్లు నిండివున్నాయి కదా! పంజాబునుంచి, కన్యాకుమారి వరకు ద్వారకనుంచి గౌహతి వరకు రెండెడ్ల బళ్ళు భారతీయ జీవితానికి పునాదై దర్శనమిస్తాయి. ఒక్కొక్క దేశానికి ఒక్కక్కరీతైన అందాలు కలిగి వుంటాయి. ఆకులు గల పెద్ద చక్రాలు చిన్న చక్రాలు, ఆకులులేని రాతి చక్రాలో గట్టికఱ్ఱ చక్రాలో ఈ బళ్ళు సాగుతూనే వున్నాయి. నైజామ్‌లో జనాన రెండెడ్ల బళ్ళు. వెదురు బద్దలతో గుండ్రంగా షానం కట్టిన బండ్లు, రథాలువలె నాలుగు చక్రాలు కలిగి ముందు రెండు చక్రాలు యెద్దులపాటు తిరుగుతూ పైన గుడి శిఖరం వంటి శిఖరం కలిగిన చిత్రమైన బళ్ళు ఉత్తరాదిని, తెలంగాణం, మరాటావాడలలో కనబడతాయి. ఆకాశం అంత యెత్తు కలిగి యెద్దులుగల బళ్ళు ఉత్తరాది బళ్ళు. వాటికి తగిన ఎత్తూ గల సింధీ ఎద్దులు, రాజపుత్ర స్థానంలో ఒంటెలే లాగుతాయి. గుడిలో చిన్న నందికేశ్వరునిలా పొట్టి అయిన గిత్తలుగల చిన్న రెండెడ్ల బళ్ళు మనరాష్ట్రంలో – జింక కొమ్ములవంటి అందమైన నిడువాటి కొమ్ములు గలిగి, పరుగు తప్ప నడకే ఎరుగని పెనుగొండ సీమ ఎద్దుల జతగలిగిన రాయలసీమ మైసూరు బళ్ళు, కొండ ఘాటీలు ఎక్కుతూ, ధిగుతూవున్న నౌరంగపురం జయపురం బండ్లు – ఇలా దేశమంతా బండ్లు నిండివున్నాయి.

రాధారి బండి ఎంత అందమైనదో ఆ బండినిలాగే ఎద్దులు ఎంత గంభీరంగా, సౌందర్యమూర్తులై వుంటాయో అలాగే ఆ బండిని సారధి అయిన ఆ పల్లెటూరి కోడెకాడూ, అంత ఠీవిగా అంత హుషారుగా వుంటాడు, కోరతలపాగా చుట్టుకొని, వెనక కుచ్చు వీపుమీద అల్లల్లా ఎగురుతూ ఆడుతూ వుంటే, పైనకుచ్చు కిరీటంమీద తురాయిలా విడంచించిఉంటే, మహారాజులాగే దర్శనమిస్తాడు. అతను మెళ్ళో పులిగోరుతాడు. నాలుగు వెండి కాసులుంటాయి. కండలు చుట్టిన దండల కడియాలో బాటుపురులో, మొలను వెండి గోనతాడో బిళ్ళల మొలతాడో, ముంచేతులకు, ముడుగులూ, చేతులో ములుగోలు కమిచీ కఱ్ఱ. అతడు ప్రపంచమంతా రాజ్యం చేస్తూ కనపడ్డాడంటే అతిశయోక్తి ఏముంది.

*"ఓరోరి బండివోడా? వొగలమారీ బండివోడా*
*ఆపవోయి నీబండీ, నిలపవోయి నీబండీ"*

అనేపాట ఏ వయ్యారి పడుచో అతనిపైన పువ్వులు చల్లేది. అతనికి తన ఎడ్లంటే ప్రాణం, వాటిని తన బిడ్డలుకన్న ఎక్కువగా చూస్తాడు. వాటికి పొద్దున్నే చిట్టూ, తవుడు, వులవలు పెడ్తాడు. స్వయంగా పచ్చిక కోసుకొచ్చి, ఆరగింప జేసినట్లు వాటిని మేపుతాడు. పచ్చిగడ్డితోపాటు, జనుముకట్ట, జొన్న దంటు, ఎండుగడ్డి వేస్తాడు. వాటిని చెరువుకి తీసుకువెళ్ళి దినదినమూ కడుగుతాడు. మంచినీళ్ళు తాగిస్తాడు. ముద్దు పేరు పెట్టుకుంటాడు. రాముడు, లక్ష్మణుడు, వెంకటగిరి, సింహాచలం, నంది భూంది అని హృదయమారగ పిల్చుకుంటాడు. ప్రయాణాలకు వాటిని అలంకరించుకుంటాడు. అవిశ్రుతికాగా పాడుకుంటాడు.

పూర్వకాలంలో దొంగల భయముండే చోట, దూరపు ప్రయాణమైనప్పుడు, అడవుదారుల పులి, చిరుత, చిందువూ, కొరణాసి, వేగూలము సంచరించే ప్రదేశాల్లో వెళ్ళవలసి వచ్చినప్పుడు పది పన్నెండు బండ్లు జట్టులుగా పోయేవారు. బళ్ళకు వెనుక వైపున దట్టమైన తడికలు కట్టేవారు ప్రతి బండి ఒక చిన్నకోట. ప్రతి యెద్దూ ఒక యుద్ధ వీరుడు.

కాశీయాత్ర కానీ, రామేశ్వరయాత్ర కానీ ఈ రాధారి బళ్ళే సాగించేవి. వర్తకుల ఎగుమతి దిగుమతి ప్రయాణాలు ఈ రాధారిబళ్లు నిర్వహించేవి.

ఎన్ని కథలు పుట్టాయి రాధారిబళ్ళను గురించి! నీతి చంద్రికలో మిత్రభేదంలో సంజీవకము ఈ రాధారిబండి యెద్దే, మా వైపున ఓ కథ ఉంది. ఒక పల్లెటూరి బాలిక. నవ యవ్వనంలో మిసమిసలాడి పోతున్న వలపులవయ్యారిని, సొగసుల మిటారిని, ఆ అమ్మాయి తండ్రి ఆ పడుచుకు ఇష్టం లేని ఓ నడిమి వయస్సువానికి ఇవ్వదలచుకున్నాడట. ఆ పెళ్ళి కొడుకు కొమ్మమీది కోతిలా వికారమైన అందం గలవాడట. ఆ వయ్యారిభామ అలాంటి పెళ్ళికొడుకు నాకు ఒద్దూ అని వాళ్ళ అమ్మ దగ్గర గోలపెట్టిందంటే పెట్టదూ! ఆ అమ్మాయికి బండితోలే బావంటే చాల ఇష్టం. అతను పొలానికి బండిలో వెళ్ళుతుంటే యెన్నిసార్లో తానూ ఆ బండి మీద వెళ్ళేది. ఊచబియ్యం తింటూ, పాటలు పాడుకుంటూ, ఏవో నర్మ అమాయికమైన వెంగపు మాటలతో ఉప్పొంగిపోయే వారు. పొలాలకు శ్రుతికల్పిన హాస్యాలు, హాస్యాలతో తాళం కల్పిన నవ్వులు వీటి అన్నిటిలో సామ్యమైన అకల్మషత వాళ్ళబండి గంటలతో కలసి వచ్చేది. పెళ్ళిరోజులు దగ్గరకు వస్తున్నాయి. వీళ్ళిద్దరి సంగతి గమనిస్తున్న వాళ్ళవ్వ వీళ్ళిద్దరికి మద్దతు, ప్రోత్సాహం. ఓ రాత్రిరాత్రి వీళ్ళిద్దరూ రాధారి బండ్లెక్కి, పుంతదారుల డొంకదారుల రాత్రి చుక్కల వెలుగులో వాళ్ళవ్వతో ఇంకా ఇద్దరు పెద్దలతో చిన్న తిరుపతి చేరుకున్నారు. శ్రీ వేంకటేశ్వరుని సన్నిధానంలో వాళ్ళిద్దరూ భార్యా భర్తలై చక్కాపోయారు. తల్లిదండ్రులు ఈరాధారి బండి ప్రయాణం పెళ్ళికి ఒప్పుకోక తప్పిందికాదు. కథ కంచికి వెళ్ళింది. మనం ఇంటికి వచ్చాం.

ఈలాంటి కథలు పల్లెటూరి ప్రపంచంలో ఎన్నో అడవి పూవులలా వికసించి వున్నాయి. ఆనాటి రోజులు మళ్ళీ వస్తాయా? నేడు బస్సులూ, రైళ్ళూ వచ్చాయి. దిట్టమైన కంకర రోడ్లు నిర్మాణం అవుతున్నాయి. తెలంగాణంలోనూ, రాయలసీమలోనూ, మెరక ఊళ్ళల్లోనూ ఇప్పటికీ రోడ్లులేనిచోట ఈ రాదారి బళ్ళ ప్రయాణాలు సాగుతూనే ఉన్నాయి.

వేదకాలంనుంచీ రాధారిబళ్ళ ప్రయాణం భారతదేశమంతా నిండి వుండేది, సంస్కృత సాహిత్యంలో, దేశభాష సాహిత్యాలలో, పద్యాలలో, పాటలలో, కథలలో, గాథలలో ఈ రాధారి బళ్ళ ప్రయాణం ఎంతో మనోహరంగా వర్ణించారు పూర్వకవులు.

అజంతా చిత్రలేఖనంలో, అమరావతి, భట్టిప్రోలు, నాగార్జునకొండ మొదలైన శిల్పాల్లో ఈ రాదారి బళ్ళు విన్యసింపబడి ఉన్నాయి. పల్లెటూరి వారికనే నాలుగు గుఱ్ఱాలు పూన్చిన రథాలు. ఆ శిల్పాలలో నాలుగూ ఎనిమిది ఎద్దులు కట్టిన బళ్ళు వున్నాయి. రెండు మూడు కుటుంబాలు పట్టేంత రెండెడ్ల బళ్ళున్నాయి.

చిత్రకారుని హృదయానికి, కొండ ఘాటీ రాచబాటలలో, కొండశిఖరాలు, చరియాలూ, లోయలూ, సెలయేళ్ళు అడవులు చుట్టే వున్న ప్రకృతి సౌందర్యం ఆనంద తాండవంచేసే ప్రదేశంలో ఒకటో, రెండో రాధారి బళ్ళు ప్రయాణం చేస్తూ వుండే ఆ దృశ్యం ఆ సౌందర్యానికి లావణ్యం కూర్చినట్లు అందమైన పుష్పానికి తావి సమకూరినట్లు దర్శనమిస్తుంది. పూర్వకాలం నుంచీ ఎంతమందో చిత్రకారులుకు ఈ దృశ్యం విన్యసించడం ఎంతో ఆనందం, తెల్లని నల్లని మబ్బులు కూడిన నీలాకాశం, ఆకాశంలోకి చొచ్చుకుపోయి పడగలు విప్పి ఆడే పాములులా తాడిచెట్లు, ఆ చెట్లమధ్య ఆ పల్లెనాటి డొంక దారులు రెండెడ్ల బళ్ళు! ఆ వెనక దూర దూరంగా ఆ తోపులలో కోనేరూ, గుడీ పల్లెటూరు? ఎంత కళా పూర్ణమీ భావం!

*తోలవోయి మన బండీ*
*త్రోవ దూర మెటనుండో*
*ఎటనుండో సాగెదారీ*
*ఏ దూరం విడిదిచేరు రాధారై.*

* * * *